క్లుప్తంగా

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

కమలాపురం : మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అత్యవసర సమావేశానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరు కానున్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న డ్రైనేజ్, అభివృద్ధి పనులపై చర్చిస్తామని, మున్సిపల్ పరిధిలోని వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, ఇన్డోర్, అవుట్ డోర్ మున్సిపల్ సిబ్బంది ఈ సమావేశాన్ని హాజరు కావాలని ఆయన తెలిపారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి ముడుపులను చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. ఆలయ ఆవరణలోని ఆలయాలలో పూజలు నిర్వహించారు.

నేత్రదానం



కార్నియాలు సేకరిస్తున్న సేవా సమితి సభ్యులు తదితరులు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన పురుషోత్తం(32) గుండెపోటుతో మరణించారు. దీంతో ఆయన తల్లిదండ్రులు వరలక్ష్మి, వెంకటరమణ, అన్న మురళీకృష్ణలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన కార్నియాలు సేకరించారు. మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా మరోకరికి చూపును ఇస్తాయన్నారు.

3 నుంచి విజయదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రులు

కడప కల్చరల్: కడప నగరంలో కొలువుదీరిన విజయదుర్గాదేవి ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాదరావు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది దసరా ఉత్సవాలను ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజూ ప్రత్యేక అలంకారాలతోపాటు, ఆలయ ప్రదక్షిణ, గ్రామోత్సవం, ప్రత్యేక కళాకారులతో అనేక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శన ఉంటాయని వివరించారు. అక్టోబరు 3న విజయదుర్గాదేవిని శైలపుత్రిగా, 4న బ్రహ్మచారిణిగా, 5న చంద్రఘంటగా, 6న కుష్మాండదేవిగా, 7న స్కంద మాతగా, 8న కాత్యాయినిగా, 9న కాళరాత్రిగా, 10న మహాగౌరీగా, 11న సిద్ధిధాత్రిగా అలంకరిస్తామన్నారు. 12న విజయదుర్గాదేవిగా అలంకరించి, అదే రోజు రాత్రి 8 గంటల నుంచి నగరోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

వ్యాసరచన పోటీలు

కడప కల్చరల్: ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్రపై ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని అల్మాస్ పేట వద్దగల జామియా తుస్సాలిహత్ మదరసాలో జరిగిన ఈ పోటీలను డాక్టర్ ఎఫ్ఎం.ముక్తార్ అహ్మద్ ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో నిర్వహించిన ఈ వ్యాస రచన పోటీల్లో 5200 మంది విద్యార్థులు పాల్గొన్నార న్నారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్‌బాబు, సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

2న శాంతి ర్యాలీ

కడప కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2న కడప నగరంలో ఆధ్యాత్మిక నిరసన, శాంతి ర్యాలీ నిర్వహించనున్నామని బెస్తవేముల రామ మహేష్, మనోహర్ రెడ్డి తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే శాంతి నిరసన కార్యక్రమంలో భాగంగా కడపలో అక్టోబరు 2న ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక ఎన్జీఓ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ర్యాలీ ప్రారంభమై సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో హిందూ ధార్మిక సంస్థలు, ఆశ్రమ, పీఠాధిపతులు, దేవాలయాల నిర్వహణ కమిటీలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు



నాటుసారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)



ధ్వంసమైన నాటుసారా ఊటలు (ఫైల్)

కొండాపురం : మండలంలోని గ్రామాల్లో కొత్తగా బెల్ట్ షాపులు వెలసి మద్యం విక్రయాలు మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా సాగుతున్నాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా మద్యం రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పేదలు కూలీ మొత్తం మద్యానికి తగలేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కనుమరుగైనా బెల్ట్‌షాపులు ఇప్పుడు ఊరురావెలుస్తున్నాయి. కొండాపురం మండల కేంద్రంలో రెండు, తాళ్లప్రొద్దుటూరులో ఒకటి ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రావడంతో కర్ణాటక మద్యం, బెల్టు షాపులపై దృష్టిపెట్టారు. కొండాపురంలోని నూతన జాతీయ రహదారి ఇరువైపుల కొత్తగా మూడు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో, పెంజిఅనంతపురం మూడు రోడ్ల కూడలిలో బెల్టుషాపులు కొత్తగా వెలిశాయి. దత్తాపురం పునరావాస కేంద్రం సి బ్లాక్ లోను, పెంట్రోల్ బంక్ ఎదురుగా ఓ చికెన్ దుకాణంలో కర్ణాటక మద్యం చీప్ లిక్కర్ క్వార్టర్ రూ. 30 ధర తెచ్చుకుని రూ.150 విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎవరి వాటా వారికి వెళ్లుతున్నట్లు బెల్టు షాపుల విక్రయాదారులు చెప్పడంతో ప్రజలు చర్చికుంటున్నారు.

డోర్ డెలవరీ అవుతున్న మద్యం బాటిళ్లు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏకంగా మద్యం బాటిళ్ల డోర్ డెలవరీ అవుతున్నాయి. కొండాపురం దత్తాపురం పునరావాసకేంద్రాల్లో మద్యం బాటిళ్లు కావాలని ఫోన్‌చేస్తే చాలు ఎక్కడికి కావాలంటే అక్కడికి మద్యం సరఫరా చేస్తున్నారు. కొండపైన దొబ్బుడుపల్లె, తిరుమలాయపల్లె గ్రామ సమీపంలో నాటుసార తయారు చేస్తున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు వీటిని నియంత్రించడంలో ఘోరంగా విఫలమయ్యారు. బెల్టుషాపులు జోరుగా కొనసాగుతున్నా...కొందరు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గాడిలో పెట్టాల్సిన వారే ప్రత్యక్షపాత్ర పోషిస్తూ మమ అనిపిస్తున్నారు. జిల్లా పోలీస్, ఎక్సైజ్‌శాఖ వారు ప్రత్యేక దృష్టిపెట్టి అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎక్సైజ్ శాఖ ముద్దనూరు సీఐ జి.నాయుడును సాక్షి వివరణ కోరగా గత నెలలో దత్తాపుర్తం సి బ్లాక్‌లో కర్ణాటక మద్యం అమ్ముతుంటే దాడులు నిర్వహించి పట్టుకుని కేసు నమోదు చేశాం. మా దృష్టికి సమాచారం వస్తే దాడులు నిర్వహిస్తామన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

చింతకొమ్మదిన్నె: ఇటీవల రెండు రోజుల క్రితం జూనియర్ ఎన్టీఆర్ దేవర సినిమాకు వెళ్లి జమాల పల్లికి చెందిన షేక్‌మస్తాన్‌వల్లి గుండెపోటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం యువకుడి కుటుంబానికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ తరుపున అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎర్రమల సుధాకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలు తక్షణ ఆర్థిక సాయంగా రూ.లక్ష ఇరవై వేలు వారి కుటుంబానికి అందజేశారు. అలాగే మృతుడికి చెందిన పిల్లల చదువులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ద్వారకనాథరెడ్డి, హరి, గౌస్, సునీల్, సాయి, రామ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కడపను రక్తదాతల జిల్లాగా మారుద్దాం

కడప ఎడ్యుకేషన్ : కడపను రక్త దాతల జిల్లాకు మారుద్దామని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అక్టోబరు 1న జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా గోడ పత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి ముందుకు రావాలన్నారు.

తాగునీరు రాక అవస్థ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని దేవుని కడప సచివాలయం వీధిలో తాగునీరు రాక జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గండి వాటర్ వర్క్స్ నుంచి కడప నగరానికి దేవుని కడప నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కానీ ఇక్కడి ప్రజలకు మాత్రం నీరు సరఫరా కావడం లేదు. వాటర్ మెన్, ఫిట్టర్, ఏఈ, డీఈలకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతానికి తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.

మానవత సేవలు అభినందనీయం

పులివెందుల టౌన్ : మానవత సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఆదివారం స్థానిక మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ సేవాసంస్థ చేపడుతున్న సేవలు ఎనలేనివన్నారు. మానవత సంస్థ శాశ్వతసభ్యుడు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్లాస్టిక్ నివారిద్దాం -పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ మానవత తరుపున గుడ్డ సంచులను అందజేసినందుకు వారిని అభినందించారు. మానవత సంస్థ సభ్యులు మెమెంటోలను అందజేసి శాలువతో ఆయనను సత్కరించారు. మానవత సంస్థ డైరెక్టర్, జేఎన్టీయూ ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా యూనివర్సిటీలో అవార్డు పొందినందుకు మానవత సంస్థ ఆమెను సత్కరించారు. అనంతరం కమిషనర్ గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి, కన్వీనర్ బి.వి.కృష్ణారెడ్డి, గౌరవ సభ్యులు ఏ.వి. గోపాల్‌రెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారాయుడు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కాంక్రీట్ ఫ్లోరింగ్



పాఠశాలను సందర్శించిన సాక్షి మీడియా గ్రూపు ఫైనాన్స్ డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం 1972–73 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, సాక్షి మీడియా గ్రూపు ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి రూ.2.50 లక్షలతో పాఠశాలలో కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం ఎర్రగుంట్లకు వచ్చిన ఆయన పాఠశాలను సందర్శించి పనులను పర్యవేక్షించారు. ఆ పాఠశాల వృత్తి విద్య ఉపాధ్యాయులు చంద్రఓబుళరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

నడకతో గుండె పదిలం

గుండె వ్యాధి నిపుణులు డా.వంశీధర్



మాట్లాడుతున్న డాక్టర్ వంశీధర్

కడప ఎడ్యుకేషన్ : నడకతోనే గుండె పదిలంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ రోజూ కాలినడక అలవాటు చేసుకోవాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్.వంశీధర్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం 'గుండె సంబంధిత జబ్బులు–జాగ్రత్తలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ నూనె వస్తువులు లేకుండా మితంగా ఆహారం తీసుకుంటే గుండె సంరక్షణ సాధ్యం అని అన్నారు. జనరల్ సర్జన్ డా.మురళి మాధవ్ మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లతోపాటు మంచి జీవనశైలితో గుండెను కాపాడుకోవచ్చునని పేర్కొన్నారు. సైన్సు క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి గుండె జబ్బులపై తాను తయారు చేసిన పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా.గునిశెట్టి శ్రీనివాసులు, డాక్టర్ రవీంద్రనాథ్, డా.సావిత్రి, డాక్టర్.రవి శేఖర్, డాక్టర్ రామచంద్ర, డా.విశ్వనాథం, అపర్ణ, మహేష్, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామరాజు, సునీత, ధీరజ్ పాల్గొన్నారు.

తల్లికి వందనం నిధులు మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ప్రకటించిన రూ.15 వేలు వెంటనే ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలని ఏపీడీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరి సివి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడపలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, గత తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు. పేద విద్యార్థులకు ఐదు యూనిఫామ్‌లకు సరిపడా క్లాత్, కుట్టుకూలీ మొత్తం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు ఏపిటిఎఫ్ అమరావతి ఈ కార్యక్రమంలో ఉమాకాంత్, సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరణాగతి పద్ధతిలో లోకనాథం కవిత్వం



రచయిత మామిళ్ల లోకనాథాన్ని సత్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : శరణాగతి పద్ధతిలో రచయిత మామిళ్ల లోకనాథం శారదాంబ, లక్ష్మి, దుర్గ మాతల గురించి కవిత్వం రాయడం అభినందనీయమని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. లోకనాథం రచించిన శ్రీదేవి త్రయ శతకమంజరి పుస్తకాన్ని స్థానిక పాత కడపలోని దేవాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ శరణాగతి పద్ధతిలో లోకనాథం ముగ్గురమ్మలను స్తుతిస్తూ చక్కని పద్యాలు రాశారన్నారు. అనంతరం రచయితను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాల్వ అర్జునరెడ్డి, ఏఎల్.కృష్ణారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, పసుపులేటి శంకర్, సతీష్‌కుమార్‌రెడ్డి, గానుగపెంట హనుమంతరావు, లేవాకు రఘునాథరెడ్డి, కోడూరు సుమన, ఒంటిమిట్ట నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిబిరం

కడప కల్చరల్: కడప పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో యోగా శిక్షణా శిబిరం ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. మంగళ వారం నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో మానసిక ఒత్తిళ్లు, బీపీ, డయాబెటీస్, అస్తమా, గ్యాస్‌ట్రబుల్, ఒబెసిటీ, థైరాయిడ్ సమస్యల నివారణకు సాధన చేయిస్తామన్నారు. ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు తొలి బ్యాచ్, 8.30 నుంచి 10.00 గంటల వరకు మహిళలకు ఒక బ్యాచ్, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటలకు మరో బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 98488 61206 లేదా 70132 38986 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పీఎం కిసాన్ అర్హుల జాబితా సిద్ధం

అట్లూరు : పీఎం కిసాన్ అర్హుల జాబితా రైతుసేవా కేంద్రాల్లో ఉందని, అర్హులు జాబితాను పొందవచ్చని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. అక్టోబర్ 5న 18వ విడత పీఎం కిసాన్ నిధి రూ.2 వేలు చొప్పున అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేస్తారన్నారు. అదే రోజు రైతుసేవా కేంద్రాల్లో ప్రధాని సందేశాన్ని ప్రసారం చేస్తారన్నారు.

భక్తి శ్రద్ధలతో నాతియా మెహఫిల్



మాట్లాడుతున్న హజరత్ సయ్యద్ షా మహమ్మద్ షేక్షుద్ హుసేని సాహెబ్

కడప కల్చరల్: కడప నగరంలోని అస్తానె హుసేనియా పీఠంలో ఆదివారం పవిత్ర మిలాదున్ నబీ మాసోత్సవం సందర్భంగా నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాత్ ఖాన్‌లు పాల్గొని ప్రవక్త పట్ల తమ భక్తిని చాటుకున్నారు. అస్థానె హుసేనియా పీఠాధిపతి సయ్యద్ షా మహమ్మద్ షేక్షుద్ హుసేని సాహెబ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి నాతియా మెహఫిల్ నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కవులు తమ నాతియ కలాంలతో అత్యద్భుతంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో మత గురువులు, ప్రముఖ కవులు, ముస్లిం ప్రముఖులు, మౌల్వీలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గుంతబజార్ సర్కిల్‌లో..

మహా ప్రవక్త మహమ్మద్ జయంతిని పురస్కరించుకుని కడప గుంతబజార్ సర్కిల్‌లో మంగళ వారం నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సుబాన్‌బాష తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో నగర ముస్లిం ప్రముఖులు, గురువులు పాల్గొంటారన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

బాబు పాలనను ప్రజలు ఛీ కొడుతున్నారు

– వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : టీడీపీ వంద రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ కావడంతో టీడీపీ నాయకులకు మతిభ్రమించి వైఎస్ కుటుంబ సభ్యులను ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్‌లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషాలు అన్నారు. ఆదివారం వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి వైఎస్ కుటుంబీకులపై ఆరోపణలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ మనోహర్‌రెడ్డి కొడుకుల వివాహాలకు నువ్వు వచ్చే వుంటావు.. ఆ వివాహాలు హిందూ సాంప్రదాయ పద్ధతిలో మూడు రోజులు జరిగింది. పులివెందుల పట్టణ ప్రజలందరికీ తెలిసిన విషయమే. వారి మనవల్లు పుట్టు వెంట్రుకలు కూడా తిరుమలలోనే స్వామి వారికి అర్పించటం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం తిరుమల దర్శనానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా మతం మానవత్వం అని చెప్పడం మీరు వినలేదా అన్నారు. వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డిల గురించి మాకన్నా నీకే ఎక్కువ తెలుసునన్నారు. చంద్రబాబునాయుడి వందరోజుల పాలన గురించి రాష్ట్ర ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ఈ వందరోజుల అట్టర్ ఫ్లాప్ పాలనను కప్పిపుచ్చేందుకు లడ్డు వ్యవహారాన్ని తెరపైకి తీసుకురావడం జరిగిందన్నారు. లడ్డులో కలిపే నెయ్యిలో కల్తీ ఉంటే అధికారులు ఏం చేస్తున్నట్లని వారు ప్రశ్నించారు. నెయ్యిలో కల్తీ ఉన్న ట్యాంకర్లను అధికారులు వెనక్కి పంపించడం మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. చేతనైతే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే విధంగా చూడాలన్నారు. అంతేగాని లేనిపోని అబండాలను వైఎస్ కుటుంబీకుల మీద వేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకుని ప్రజలకు మంచి చేయాలని వారు హితవు పలికారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అథ్లెటిక్, పోల్వాల్ట్ ఈవెంట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సావిత్రిదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీన వైఎస్సార్ కడప జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలలో అండర్–17 ఇయర్స్, పోల్వాల్ట్ పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్‌లో హైస్కూల్‌కు చెందిన మధన్‌మోహన్‌రెడ్డి ప్రథమ స్థానం, సన్నికుమార్‌రాజు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రవిత్రేణి ప్రథమ స్థానం, రెహానా ద్వితీయ స్థానం, పోల్వాల్ట్ ఈవెంట్‌లో సహనా ఫాజియా ప్రథమ స్థానం, మోసిన ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. అక్టోబర్ నెలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలల్లో వీరు పాల్గొటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సేవాదృక్పథం అలవరచుకోవాలి



దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న సీఐ

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు సేవా దృక్పథం అలవరచుకోవాలని ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు. వేముల మండలం శేషన్నగారిపల్లెకు చెందిన ఉపసర్పంచు ఒటికుంట నాయుడు వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో నిత్యావసర సరకులను ఆయన కమారుడు గంగాధర్‌నాయుడు అందచేశారు.

దివ్యాంగుల కోసం ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో సహాయం చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కూడా దివ్యాంగుల విద్యా, ఉపాధి కోసం తనవంతు కృషి చేస్తామని దాత తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్కు అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొండల దర్శనం కొత్త అనుభూతి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



జలపాతాల వద్ద కుమారులతో కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: కొంగు సింగారాలను ఒలగబోస్తున్న పాలకొండలు, జలపాత సవ్వడి, పక్షుల కిలకిలరావాలను కడప పాలకొండల్లో ఆస్వాదించడం ...కొత్త అనుభూతిని ఇచ్చిందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఆటవిడుపులో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన నగర శివారులోని పాలకొండలను ఆదివారం సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకం వైపు ఆసక్తిని పెంచే సహజమైన అడవులు కడప జిల్లాకు సొంతం అన్నారు. తిరుమలేశుని తొలి గడపగా ప్రఖ్యాతి గాంచిన జిల్లాలో ఎన్నో ప్రాశస్తమైన పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలు, ప్రకృతి సోయగాలు ఉన్నాయన్నారు. గండికోట కూడా ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. పర్యాటక ప్రియులు జిల్లాలోని దర్శనీయ ప్రాంతాలను ఖచ్చితంగా చూడాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో మరే సమస్యలు లేవా..?

దళిత ఫోరం జిల్లా ఛైర్మెన్ కిషోర్ బూసిపాటి



మాట్లాడుతున్న కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో మరే సమస్యలు లేనట్లు.. తిరుమల లడ్డూపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పదే పదే వ్యాఖ్యలు చేయడం సరికాదని దళిత ఫోరం జిల్లా ఛైర్మెన్ కిషోర్ బూసిపాటి విమర్శించారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తమ రహస్య ఎజెండాను పవన్ కళ్యాణ్ ద్వారా అమలు చేయిస్తోందని అర్థమవుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే తరచూ సనాతన ధర్మం గురించి మాట్లాడాల్సి వస్తోందన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు ఉపయోగించారని ల్యాబ్ రిపోర్టులో లేకపోయినా, వాటిని ఆపాదించి మాట్లాడటం దారుణమన్నారు. భారతదేశంలోనే ప్రముఖ క్షేత్రం తిరుమలపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మాట్లాడటం తగదన్నారు.

దేవాంగుల సంక్షేమానికి కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వృట్టి నాగశయనం తెలిపారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ దేవాంగ సంఘం కార్యవర్గ సమావేశంలో ఏపీ అధ్యక్షుడిగా నాగశయనంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడానికి కార్యాచరణ చేపడుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగశయనంను ఆ సంఘం నాయకులు సన్మానించారు.

జవహర్‌రెడ్డికి సేవా రత్న పురస్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్: డాక్టర్ జవహర్‌రెడ్డికి సేవా రత్న అవార్డు దక్కింది. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వెంకటలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. డాక్టర్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ కడప చుట్టుప్రక్కల అనేక ఉచిత రక్తదాన శిబిరాలు, హోమియో మెడికల్ క్యాంపులు నిర్వహించి వేలాది మందికి వైద్య సేవ లందించారన్నారు.